నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | సోమవారం 22 జూలై 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




మహబూబాబాద్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు

## శాకంబరీ.. శరణం మమ!

**ముగిసిన భద్రకాళీ ఉత్సవాలు**

**ఆలయానికి పోటెత్తిన భక్తులు**

వరంగల్, జూలై 21 : వరంగల్ ప్రజల కొంగు బంగారమైన భద్రకాళీ అమ్మవారు శాకంబరీ అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. 15 రోజుల పాటు కనులపండువగా జరిగిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శాకంబరీ అలంకరణ, గురు పౌర్ణమి నేపథ్యంలో భద్రకాళీ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో ఉదయం 3 గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అర్చకులు అమ్మవారిని ఐదు క్వింటాళ్ల వివిధ కూరగాయలతో అలంకరించారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా భక్తులు పెద్ద సంఖ్యల తరలివచ్చి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అలాగే గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని సాయిబాబా దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. కాగా, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.



శాకంబరీ అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

# పోటెత్తిన వరద

## మూడు రోజులుగా ఎడతెరిపిలేని వాన

- తడిసిముద్దయిన ఉమ్మడి వరంగల్ జిల్లా
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు.., నీటి మునిగిన పంటలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది



భూపాలపల్లి రూరల్ : మోరంచ వాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ



ములుగు రూరల్ : జంగాలపల్లి వద్ద తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోగా పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు



వెంకటాపురం(నూగూరు) : ప్రధాన రహదారిపై బురదలో ఇరుక్కుపోయిన బైక్



వాజేడు : వర్షపు నీటితో మునిగిన పంటచేలు

నమస్తే నెట్‌వర్క్, జూలై 21 : ఎడతెరిపి లేని వాన.. మూడు రోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షానికి ఉమ్మడి వరంగల్ జిల్లా తడిసిముద్దయింది. ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. వరద పోటెత్తడంతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. లోలెవల్ కల్వర్టులు, రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరగా, కొన్ని చోట్ల మత్తడి పోస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం గ్రామం వద్ద లోలెవల్ బ్రిడ్జి వద్దకు గోదావరి వరద భారీగా వచ్చి చేరడంతో ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మంగపేట మండలంలోని మల్లూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 115 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 114 మీటర్లకు చేరింది. లక్నవరంలో నీటి మట్టం 21 ఫీట్లకు, రామప్పలో 24ఫీట్లకు చేరింది. ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి, దొడ్లవాగు ఉప్పొంగడంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీకి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అయితే, ఈ రెండు వాగుల వద్ద అధికారులు బోట్లు ఏర్పాటు చేశారు. ములుగు మండలంలోని సర్వాపురం–జగ్గన్నగూడెం గ్రామాల మధ్య బొగ్గులవాగు లోలెవల్ వంతెన వరద ఉధృతికి పూర్తిగా నీటమునిగింది. వర్షం ఇలాగే కొనసాగితే అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, సమీపంలో ఉన్న గొత్తికోయగూడెం జలదిగ్బంధంలో చిక్కుకోనున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని సుల్తాన్‌పూర్, జంషెడ్‌దేవిపేట మధ్య లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ములుగు, అబ్బాపూర్ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టేకుమట్ల, రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. మరోవైపు గర్మిళ్లపల్లి, ఓడేడుతో పాటు బూర్నపల్లి, కిష్టంపేట మధ్య గల మానేరు వరద ఉధృతికి తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గణపురం మండలం అప్పయ్యపల్లి, వెల్తుర్లపల్లి గ్రామాల మధ్య లోలెవల్ కల్వర్టు నుంచి మోరంచవాగు ప్రవహిస్తుండడంతో ఈ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి సమీపంలో గల మోరంచ వాగు ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. వాగు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుందని, వరద ప్రభావం ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఓసీ–2,3 గనుల్లోకి భారీగా వరదనీరు, మట్టి చేరడంతో ఉపరితల గనులు బురదయమై బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. తాడిచర్ల జెన్కో ఆధ్వర్యంలో చేపడుతున్న ఏఎమ్మార్ కంపెనీలో బొగ్గు ఉత్పత్తికి ఆంతరాయం ఏర్పడింది. హనుమకొండ, వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలను సిద్ధం చేశారు. డీఆర్ ఎఫ్ బృందాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. శాయంపేట మండలంలోని మాందారిపేట నుంచి సూరంపేటకు వెళ్లే దారిలో కాజువేపై నుంచి వరద వెళ్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు నిండడంతో పరిసర లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ సత్యశారద, అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం మొట్లతిమ్మాపురం రహదారిలోని వట్టివాగు నీరు పైకి చేరుకోవడంతో రాకపోకలు స్తంభించాయి.

**ఉప్పొంగుతున్న గోదావరి..**

కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది 9.20 మీటర్ల ఎత్తులో 5.01 లక్షల క్యూసెక్కులుగా పారుతున్నది. వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరి ప్రవాహం15.830 మీటర్లకు చేరింది. అలాగే ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం ఆదివారం సాయంత్రం 5 గంటలకు 14.400 మీటర్లకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లకు జారీ చేయనుండగా, రాత్రి వరకు దాటే అవకాశం ఉంది.



గోవిందరావుపేట : మత్తడి దుంకుతున్న గుండ్లవాగు ప్రాజెక్ట్




ములుగు రూరల్ : లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న బొగ్గుల వాగు



శాయంపేట : మత్తడి పోస్తున్న చలివాగు ప్రాజెక్టు



మహదేవపూర్ : వరదకు నీట మునిగిన పంట పొలాలు



మేడారం వద్ద పొంగి ప్రవహిస్తున్న జంపన్న వాగు



ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

# పీడిత ప్రజల గొంతుక దాశరథి

- అక్షర శరాలతో నిజాం అరాచకాలను ఎదురించిన ధీశాలి
- 'నా తెలంగాణ.. కోటి రతనాణాల వీణ' అని నినదించిన కవి..
- నేడు దాశరథి శత జయంతి ఉత్సవాలు





కృష్ణమాచార్యుల విగ్రహం

మహబూబాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : 'ఓ నిజాం పిశాచమా.. కానరాడు.. నిన్ను బోలిన రాజు మాకెన్నడేని, నా తెలంగాణ.. కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఊపిరిలూదిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాములు, పెత్తందార్ల అరాచకాలపై అక్షర శరాలతో ధిక్కార స్వరం వినిపించి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కోల్పోయి జీవచ్ఛవాల్లా బతుకుతున్న తెలంగాణ సమాజంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ఆ మహనీయుడి శతజయంతిని సోమవారం అతడి స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుఉ గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నగూడూరు మండల కేంద్రంలో 1925 జూలై 22న దాశరథి వెంకటాచార్యులు–వెంకటమ్మ దంపతులకు కృష్ణమాచార్యులు జన్మించాడు. తన బాల్యం ఉర్దూలో మెట్రిక్యులేషన్, బోపాల్ విశ్వవిదాలయంలో ఇంటర్మీడియట్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ సాహిత్యంలో బీఏ పూర్తి చేశారు. సంస్కృతం, ఆగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు, కవి, రచయిత. చిన్నతనం నుంచే పద్యాలు అల్లడంలో దిట్ట. పలు సినిమాలకు గేయ రచయితగా, ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్, ఆకాశవాణి ప్రయోక్తగా పని చేశారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిది. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాశారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు రకరకాల హింసలనభిస్తున్న తెలంగాణను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వ హయాంలో జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాద్‌లోని ఇందూరు కోటలో ఆయనతోపాటు మరో 150మంది ఖైదీలుగా జైలులో ఉన్నారు. పళ్లు తోముకోవడానికి బొగ్గుతో జైలు గోడలపై పద్యాలు రాసి దెబ్బలు తిన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత భావ ప్రేరిత ప్రసంగాలతో ఊరురా సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించాడు. దాశరథి రచించిన 'ఆ చల్లని సముద్ర గర్భం..దాచిన బడబానలమెంతో.. ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..రచనలు ఇప్పటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయంటే అది దాశరథి ముద్ర అని చెప్పాలి. 'రైతుదే తెలంగాణము రైతుదే.. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. 'దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, జగత్తంతా నగరాలు కొడుతున్నది, దిగిపోవోయ్,తెగిపోవోయ్'అంటూ నిజాం పాలకులకు సింహస్వప్నంలా మారి కంటిమీది కునుకులేకుండా చేసి తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోశారు. రుద్రవీణ, అగ్నిధార, కవితాపుష్యకం, పునర్నవం, అమృతాభిషేకం, తిమిరంలో సమరం వంటి సంకలనాలు, అద్భుత కావ్యాలు దాశరథి కలం నుంచి జాలువారినవి. మారుమూల గ్రామమైన చిన్నగూడూరులో జన్మించి ఎన్నో అవార్డులు, బిరుదులు అందుకుని తెలుగు భాష, తెలంగాణ కీర్తిని ప్రంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి దాశరథి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా దాశరథికి అప్పటి ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చింది.

**మానుకోటలో శతజయంతి ఉత్సవాలు**

మానుకోట మట్టిబిడ్డ, మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్ ఉత్సవాలు నిర్వహించనుండగా, కవులు, కళాకారులు, రచయితలు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు చిన్నగూడూరు నుంచి మహబూబాబాద్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామ్‌చంద్రూనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ దేశపతిశ్రీనివాస్ తదితరులు హాజరు కానున్నారు. దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అధ్యక్షతన ఉత్సవాలు నిర్వహించనున్నారు.

**దాశరథి చిన్నగూడూరుగా నామకరణం చేయాలి**

మహాకవులు, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు జన్మించిన మండల కేంద్రానికి దాశరథి చిన్నగూడూరుగా నామకరణం చేయాలని, ఇద్దరు సోదరుల విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



### సంవత్సరం పాటు వేడుకలు

దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి ఉత్సవాలను సంవత్సరంపాటు నిర్వహిస్తాం. నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి, పీడిత ప్రజల గొంతుకగా మారిన ఆయన సేవలు వెలకట్టలేనివి. పార్టీలకతీతంగా ఈ ఏడాది జూలై 22 నుంచి వచ్చే ఏడాది జూలై 22 వరకు ఉత్సవాలు నిర్వహిస్తాం. కవులు, రచయితలు, ప్రముఖులు అందరినీ ఆహ్వానించాం. అందరూ పాల్గొని శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి.

–ఉత్సవ కమిటీ చైర్మన్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

# రవాణాకు ఇబ్బందులు కలుగొద్దు

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



గట్టమ్మ దేవాలయం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, జూలై 21 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజల రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె గట్టమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న వంతెన పనులను, వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్‌హెచ్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ములుగు జిల్లాకు వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారని, మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని సూచించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సీతక్క ఆదేశించారు. అనంతరం ములుగు కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్‌తో కలిసి అధికారులతో వర్షాలు, వరదలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## చందాలు వేసుకొని..

ఇది వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన అనుకుంటే పొరపాటే.. తమ ఊరికి వెళ్లే రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులంతా ఏకమై నిర్మించుకుంటున్న తాత్కాలిక వంతెన. సరైన మార్గం లేక ఏటా వానకాలంలో నడిచేందుకు కూడా కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండలం ముత్తారం గ్రామంలోని 114 గిరిజన కుటుంబాలు చందాలు వేసుకొని తాత్కాలిక వంతెన నిర్మాణానికి పూనుకున్నారు. – వెంకటాపురం(నూగూరు), జూలై 21



ముత్తారం గ్రామస్తులు నిర్మించుకుంటున్న తాత్కాలిక వంతెన

# 'డబుల్' ఇండ్లు కేటాయించాల్సిందే..

- తాళాలు పగలగొట్టి చొరబడిన గుడిసెవాసులు
- పోలీసులతో వాగ్వాదం.. అంబేద్కర్‌నగర్‌లో ఉద్రిక్తత
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ



డబుల్ బెడ్రూం ఇండ్ల ఎదుట ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

హనుమకొండ, జూలై 21: 'డబుల్ బెడ్రూం ఇండ్లు మాకు కేటాయించాల్సిందే.. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేదు' అని హనుమకొండలోని అంబేద్కర్ నగర్, జితేందర్‌నగర్‌లోని గుడిసెవాసులు భీష్మించుకు కూర్చున్నారు. ఆదివారం అంబేద్కర్‌నగర్‌లో నిర్మించిన ఇళ్ల వద్దకు చేరుకొని తాళాలు పగులగొట్టి అందులోకి వెళ్లి శుభ్రం చేసుకున్నారు. సుబేదారి పోలీసులు అక్కడికి వెళ్లి గుడిసెవాసులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు ససేమిరా అన్నారు. దీంతో ఇళ్ల నుంచి వారిని పోలీసులు బలవంతంగా బయటకు పంపించడంతో అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇండ్లు నిర్మించి ఐదేండ్లు అవుతున్నా లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకుని హనుమకొండ తహసీల్దార్ అక్కడికి చేరుకోగా ఆయనను సైతం నిలదీశారు. చివరకు ఆయన కలెక్టర్ దృష్టికి ఇండ్ల పంపిణీ విషయం తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గుడిసెవాసులు ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎర్ర చంద్రమౌళి, సొరం రఘు, ఓరుగంటి స్వామి, కోహెడ కృష్ణ, మామిడిపల్లి సుధాకర్, బొచ్చు సరోజన, తేజావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.